12102024-DIS-04_Layout 1 10/12/2024 2:58 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పంటల బీమా ప్రైవేటు లాభాలకే!

నర్సన్ బద్రి
94401 28169

పంట రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా.. ఈ మూడు హామీలతో తెలంగాణ రైతన్నకు తోడుగా నిలుస్తానన్న రేవంత్‌రెడ్డి మాట ఒక్కటీ పద్ధతిగా నెరవేర్చనేలేదు. ప్రభుత్వ అకాల నిర్ణయాలు, అరకొరగా వాటి అమలు తీరుతో రైతు చేతిలోంచి పంట కాలం ఎత్తిపోతున్నది. రుణమాఫీ 'ఇచ్చేది ఇచ్చాం' అన్నట్టుగా ఉన్నది. 'భరోసా'నేమో ప్రక్షాళన సాకుతోముందుకుసాగడం లేదు. 'బీమా' ఈ యాసంగి పంటకైనా అనుమానమే అన్నట్టుగా ఉన్నది. నిజానికి ఈ హామీలన్నీ జాగ్రత్తగా పరిశీలించి లబ్ధిదారులకు సకాలంలో అందిస్తేనేతగిన ఫలితాలిస్తాయి. ఎప్పుడైనా ఇయ్యవచ్చు అనుకునేందుకు ఇవి గుత్తేదారుల బిల్లులు కావు.

పంట రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా.. ఈ మూడింటిలోని మొదటి రెండింటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా నడవవచ్చు. పంట బీమా మాత్రం సకాలంలో ప్రీమియం చెల్లించకపోతే కవరేజీ లభించదు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న పంటల బీమా పథకమే ఓ విచిత్రమైన పద్మవ్యూహం. 2016లో కేంద్రం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల సారథ్యంలో నడుస్తున్నది. దీనితో రైతును బతికిస్తున్నామా లేదా వారిని దోచి బీమా కంపెనీల గల్లా పెట్టె నింపుతున్నామా అనేది ఇప్పటికీ జవాబు లేని ప్రశ్ననే.

ఈ 'యోజన' ప్రకారం వరి పంట వేసే రైతు బ్యాంకు నుంచి లక్ష రూపాయలు అప్పుగా తీసుకుంటే రూ.2 వేలు బీమా ప్రీమియం చెల్లించాలి. చిన్న, సన్నకారు రైతులకు సగం ప్రీమియంను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి. అయితే, ఏ సంవత్సరం కూడా ప్రీమియంకు సమానమైన క్లెయిమ్ సొమ్ము కూడా రైతులకు అందడం లేదు. భారీ పంట నష్టాల్లో సైతం ఆ కంపెనీలు లాభాలే మూటగట్టుకున్నాయి. పేరుకే కేంద్రం నిర్వహణలో ఉన్న ఈ పథకం రైతుకు అసలే మేలు చేయని, ఎవరికీ అర్థం కాని బ్రహ్మపదార్థంలా తయారైంది. అందుకే, దేశంలోని ఏడు ప్రధాన రాష్ట్రాలు ఆ బాధలు పడలేక ఈ పథకానికి దూరంగా జరిగాయి. దేశ ధాన్యాగారంగా పేరు పొందిన పంజాబ్ ఇందులో చేరనే లేదు. బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపీ, తెలంగాణ, జార్ఖండ్ ఈ పథకం నుంచి తప్పుకొన్నాయి. దీని వల్ల రైతులకు, ప్రభుత్వానికి భారమే తప్ప ఫలితం లేదనే భావనతో 2020లో నాటి సీఎం కేసీఆర్ తమ రాష్ట్రానికి ప్రైవేటు పైచేయి గల పంటల బీమా వద్దని నిర్ణయం తీసుకున్నారు. 2018లోనే ఆయన రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధు ప్రవేశపెట్టినందువల్ల పంట బీమా అనేది రైతుకు అనవసర ఖర్చుగా భావించి రాష్ట్రాన్ని ఆ పథకం నుంచి తప్పించారు.

రుణమాఫీ, భరోసా అనేవి సరాసరి రైతుకు ప్రభుత్వం అందజేస్తే పంట బీమా ప్రీమియం రైతు చెల్లించాలి. ఒకరకంగా ఇది రైతుకు భారమే. అయితే, బీమా పథకంపై అత్యుత్సాహం చూపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రైతు చెల్లించే ప్రీమియంను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ లెక్కన రైతులపై ఎలాంటి ఆర్థికభారం పడకూడదు. కానీ, ఖజానాపై దీని ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. రాష్ట్రంలో ఒక సీజన్ పంటలకు బీమా చేయాలంటే రైతుల నుంచి రూ.1600 కోట్లు వసూలు చేసి, ప్రభుత్వం వాటాగా రూ.2000 కోట్లు కలిపి కేంద్రానికి అప్పగించాలి. కేంద్రం తన వాటా ను కలిపి బీమా కంపెనీలకు చెల్లిస్తుంది. ప్రభుత్వ హామీ ప్రకారం ఒక సీజన్ బీమా కోసం ప్రభుత్వం రూ.3,600 కోట్ల ఖర్చు మోయవలసి ఉంటుంది.

ఆరోగ్య, వాహన బీమా మాదిరే ఈ పంటల బీమా ఉంటుంది. అయితే, ప్రమాదాలతో పోల్చితే పంటలు దెబ్బతినే సందర్భాలు ఏటికేడు పెరిగిపోతున్నాయి. వచ్చే ప్రీమియం కన్నా పరిహారం సొమ్ము ఎక్కువగా చెల్లించే పరిస్థితి రావడంతో బీమా కంపెనీలు విధివిధానాలు కఠినం చేసి క్లెయి మ్ సెటిల్‌మెంట్ నుంచి తప్పించుకుంటున్నాయి. పంట కోతలు కాగానే నష్టాన్ని లెక్కించి రైతులకు రెండు నెలల్లో చెల్లించాలి. పంట నష్టం అంచనా, చెల్లింపులకు చాలా సమయం తీసుకుంటున్నాయి. ఏదో సాకుతో క్లెయిమ్‌లు ఏండ్ల తరబడి పెండింగ్ పెడుతున్నాయి. 2017-18లో రూ.2,282 కోట్ల క్లెయిమ్స్ పక్కన పెట్టడంతో కోర్టు జోక్యం చేసుకోవలసి వచ్చింది. 'పరిహారం చెల్లించలేకపోతే కనీసం రైతుల ప్రీమియం సొమ్మునైనా వాపస్ ఇచ్చేయండ'ని కోర్టు విసుక్కోవలసి వచ్చింది.

ఏటా జరిగే బిడ్డింగ్ ద్వారా పంటల బీమా వ్యాపారాన్ని చేజిక్కించుకునే బీమా సంస్థలు ప్రీమియం నిర్ణయాల్లో, పరిహార చెల్లింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. రైతుకు సాయం చేయాలన్న సంకల్పం పోయి పంటల బీమాను కూడా లాభాల పంటగానే అవి చూస్తున్నాయి. 2016 నుంచి ఏ ఒక్క సంవత్సరం కూడా బీమా కంపెనీలు ప్రీమియంను మించి న క్లెయిమ్స్ చెల్లించలేదు. 2016-17లో దేశవ్యాప్తంగా ప్రీమియం మొత్తం రూ.21,950 కోట్లు కాగా రూ.16,827 కోట్లు మాత్రమే పంట నష్టంగా రైతులకు చెల్లించాయి. 2021-22 విషయానికి వస్తే బీమా సొమ్ముగా రూ.27,901 కోట్లు పొందిన కంపెనీలు రూ.5,761 కోట్లు మాత్రమే పరిహారంగా నిర్ధారించాయి.

పంట బాగా పండితే రైతు కూడా బీమా సొమ్ము కోసం ఎదురుచూడడు. పంట చేతికిరాని సందర్భాల్లో ప్రీమియం వసూలుచేసిన కంపెనీ ముఖం చాటేస్తే బీమాకు అర్థమే లేదు. పంట నష్టాన్ని నిర్ధారించడానికి కంపెనీలు పాటిస్తున్న విధానాలు ఘోరంగా ఉన్నాయి. ఎవరి పంటను వారికి లెక్కేయకుండా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోని నష్టాన్ని లెక్కిస్తారు. గ్రామం మొత్తంలో 33 శాతం పంట దెబ్బ తింటే నష్టంగా పరిగణిస్తారు. గత మూడేండ్ల పంట దిగుబడిని సగటుగా తీసుకొని దానికన్నా 33 శాతం తక్కువ పంట వస్తే పరిహారానికి అర్హతగా ప్రకటిస్తారు. తమ రెవెన్యూ, వ్యవసాయ శాఖల ద్వారా ప్రభుత్వాలు సేకరించిన లెక్కలను వారు అంగీకరించరు. పంటల పరిశీలన, దిగుబడి గణాంకాలన్నీ బీమా కంపెనీ సిబ్బందియే చేపడుతుంది. వారి సిఫారసు మేరకే క్లెయిమ్ సెటిల్‌మెంట్ ఉంటుంది.

రైతుకిచ్చిన హామీలు ఎక్కడికక్కడే ఉండగా, పంటల బీమా ఈ ప్రభుత్వంతో సాధ్యపడేనా అనే అనుమానం కలగకమానదు. కచ్చితంగా చేసి తీరుతామనుకుంటే ఇప్పటికే బీమాను అమలుచేస్తున్న రాష్ట్రాల అనుభవాలను గమనించి ముందడుగువేయాలి.

దామగుండం మాకో భావోద్వేగం

'దామగుండం' అంటే మాకో భావోద్వేగం! ఒక్క మాటలో వర్ణించలేని ప్రకృతి సృష్టించిన అద్భుతమది. గలగలపారే సెలయేర్లు.. పక్షుల కిలకిలరావాలు.. పచ్చని చెట్లు.. ఇలా ఒక్కటేమిటి దామగుండమంటే ప్రకృతి రమణీయత. ఓ వైపు ప్రకృతి నిలయం దామగుండం.. మరోవైపు అధ్యాత్మిక కేంద్రం రామలింగేశ్వరుడి క్షేత్రం.. మా జీవితాలతో విడదీయరాని అనుబంధంగా అల్లుకుపోయాయి.

చటారి దశరథ్
96187 18186

నా చిన్నతనంలో అమ్మమ్మ వాళ్ల ఊరు బాకాపురం వెళ్తే కుటుంబమంతా కలిసి దామగుండానికి వెళ్లేవాళ్లం. ఆ ప్రకృతి అందాలను చూసి పరవశించిపోయేవాళ్లం. దామగుండం వెళ్తే సర్వరోగాలు నయమవుతాయని మా అమ్మమ్మ అంతమ్మ చెప్పేది. ఏటా రామలింగేశ్వరుడి జాతర కన్నుల పండువగా జరిగేది. అక్కడి ప్రజలు దామగుండం, రామలింగేశ్వరుడి దర్శనం తర్వాతే ఏ కార్యక్రమమైనా ముందటేసుకుంటారు. దామగుండంలో వీచే గాలుల మాదిరిగానే అక్కడి ప్రజల మనసులూ స్వచ్ఛమైనవే. దామగుండం ముచ్చట్లు చెప్పుకుంటూపోతే ఇప్పట్లో ఒడువదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరాక జరుగుతున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో భవిష్యత్తులో దామగుండం కనుమరుగవుతుందేమోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర సర్కార్ ప్రకటించినప్పటి నుంచి జరగనున్న విధ్వంసం తలచుకుంటేనే భవిష్యత్తులో జరిగే దుష్పరిణామాలు కండ్లముందు కనిపిస్తున్నాయి. నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు వెనుక దేశ ప్రయోజనాలే ఉండొచ్చు. కానీ, మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతున్న ఈ రోజుల్లో ప్రకృతి ప్రసాదించిన దామగుండం అటవీ క్షేత్రాన్ని దహించివేయడం ఎందుకు?

నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు దామగుండం లాంటి ప్రాంతం ఏ మాత్రం సరికాదు. ఈ కేంద్రం ఏర్పాటుతో ఇక్కడి ప్రకృతి విధ్వంసమవుతుంది. రాడార్ కేంద్రం ఏర్పాటుతో సానిక ప్రజలు రేడియేషన్ ప్రభావానికి గురవుతారు. ఈ విషయాన్ని ప్రభుత్వాలు కొట్టిపారేస్తున్నప్పటికీ ఇది ముమ్మాటికీ నిజం.

రాడార్ కేంద్రం వల్ల ఒక్క దామగుండమే కాదు, పక్కన ఉన్న అనంతగిరి అడవులు కూడా విధ్వంసం అవుతాయి. ఎన్నో అరుదైన జంతుజాతులు అంతరించిపోతాయి. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటూ అంతర్జాతీయ స్థాయిలో తీర్మానాలు చేస్తున్న ఈ రోజుల్లో.. జీవవైవిధ్యానికి కేరాఫ్‌గా ఉన్న దామగుండాన్ని ఇలాంటి రాడార్ కేంద్రాలకు కేటాయించటం ప్రకృతి పట్ల పాలకుల అవగాహనారాహిత్యాన్ని తెలియజేస్తున్నది. రాడార్ కేంద్రం ఏర్పాటుతో దామగుండం ఆంక్షల వలయంలోకి వెళ్తే మా ప్రాంత ప్రజ లు కొలిచే రామలింగేశ్వరుడి దర్శనం దొరుకుతుందా? అన్న భయం నన్ను వెంటాడుతున్నది.

2009లోనే రాడార్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రాడార్ అంశం తెరపైకి రాలేదు. కేంద్ర ప్రయత్నాలను నాటి కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకోవడమే దానికి ప్రధాన కారణం. మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాడార్ ప్రాజెక్టుకు సంబంధించిన కీలక దస్త్రాల దుమ్ము దులిపి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2024 జనవరి 24న సీఎం రేవంత్‌రెడ్డితో నేవీ అధికారులు భేటీ అయ్యారు. అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1,174 హెక్టార్ల అటవీ భూమిని అధికారికంగా నేవీకి అప్పగించారు. నేవీ అధికారులతో భేటీ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే రాడార్ కేంద్ర ప్రాజెక్టుకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. ఓ వైపు చేసేది చేస్తూనే మరోవైపు తమకేం తెలియదని గత ప్రభుత్వంపై నిందలు మోపు తూ కాంగ్రెస్ పాలకులు చేతులు దులుపుకుంటున్నారు.

పర్యావరణ విధ్వంసంలో తెలంగాణ ప్రభుత్వం భాగం కాకూడదంటే తక్షణమే ప్రాజెక్టుపై పునరాలోచన చేయాలి. భూముల బదలాయింపు ఒప్పందాలను రద్దుచేసుకోవాలి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై కూడా పోరాడేందుకు వెనుకాడకూడదు. 'లేదు, మేం ఇలాగే రాజకీయాలు చేస్తూ కాలం వెళ్లదీస్తామ'ని చూస్తే ఈ ప్రాంత బిడ్డలు చూస్తూ ఊరుకోరు. మరో పోరాటానికి సిద్ధమవుతారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చాటిన చైతన్యాన్ని, పోరాట స్ఫూర్తిని మరోసారి గట్టిగా చాటిచెప్తాం. 'సేవ్ దామగుండం' అనే ఏకైక నినాదంతో జరుగుతున్న ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి మా భావోద్వేగాలతో ముడిపడి ఉన్న దామగుండాన్ని రామలింగేశ్వరుడి సాక్షిగా రక్షించుకుంటాం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)



యవ్వన దశలో, తాము చదువుకునే కాలంలో, భవిష్యత్తులో ఏం కావాలో.. ముందే లక్ష్యం పెట్టుకొని కృషిచేయటం సహజం. ఈ కాలంలో వ్యక్తిత్వ వికాస పుస్తకాలు విపరీతంగా రావడమే కాదు, మోటివేషన్ క్లాసులు కూడా విస్తృతంగా జరుగుతున్నాయి. గత 50 ఏండ్ల కిందటి కాలానికి, ఇప్పటి కాలం ఆలోచనల్లో బోలెడంత వ్యత్యాసం ఉన్నది. 50 ఏండ్ల కింద వ్యక్తిత్వ వికాసంతో పాటుగా ఆ కాలానికి సామాజిక వికాసం అన్నది సిలబస్‌లో లేని పాఠంగా అందరిలో బలంగా ఉండేది.

సబ్బండ వర్గాలకు అండ

జూలూరు గౌరీశంకర్

యాభై ఏండ్ల కింది నాటి జాతీయ, అంతర్జాతీయ స్థితిగతులు, దేశంలోని సామాజిక పరిస్థితులు, సోషలిస్టు తరహా దేశ నిర్మాణం, సమసమాజ నిర్మాణ చర్చలు విస్తృతంగా జరిగేవి. అందుకు కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వేదికలయ్యేవి. ఆ సందర్భాన్నే ఎర్ర భావాల పరిభాషలో కళాశాలలు కదనరంగాలుగా మారాయని చెప్తుంటారు..

సరిగ్గా ఆ సమయంలో 25 ఏండ్ల వయస్సులో ఎం.ఏ.ఇంగ్లీష్‌ను పూర్తిచేసుకున్న సిరికొండ మధుసూదనాచారి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే వెంటనే ఇంగ్లీష్ లెక్చరర్ అయ్యేవాడు. తన తమ్ముళ్లు, అన్నలు, చెల్లెళ్లు అంతా ప్రభుత్వ ఉద్యోగులే. ఇంగ్లీష్ లెక్చరర్ల కోసం నోటిఫికేషన్ పడితే తండ్రి ఒత్తిడి మీద మధుసూదనాచారి దరఖాస్తు చివరిరోజున సర్వీస్ కమిషన్‌కు వెళ్లి 'పోస్టులెన్ని, దరఖాస్తులెన్ని' అని అడిగాడు. పోస్టులు 70, అప్లికేషన్లు 69 అని చెప్పారు. అయినా మధుసూధనాచారి అప్లయ్ చేయలేదు. తాను రాజకీయాల్లోకి రావాలనుకున్నారు. ఎమ్మెల్యే కావాలనుకున్నారు. రాజ్యాధికారంలో తన జాతి ఎక్కడుందో అర్థం చేసుకున్నారు. తన జాతికి ధనం, రాజ్యాధికారం లేదని ఆయనకు అర్థమైంది. దేశంలో చట్టసభల్లోకి పోయిన కులాలు, నేటికీ చట్టసభలకు పోలేని కులాలు ఎందుకున్నాయో శోధించారు.

ఉమ్మడి ఏపీలో విశ్వకర్మ కులానికి ఎందుకు ప్రాతినిధ్యం లేదో వెతికారు. ఇదే ఆయన రాజకీయాల్లోకి రావటానికి, 1994లో 38 ఏండ్ల వయస్సులో ఎమ్మెల్యే కావటానికి దోహదం చేసింది. నాటి టీడీపీ అధినేత ఎన్టీఆర్ మధుసూదనాచారికి టికెట్ ఇవ్వటంతో గెలిచి తొలిసారిగా శాసన సభలో అడుగుపెట్టారు. ఆ తర్వాత రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలు, తెలంగాణ అస్తిత్వంతో ఉద్యమ రాజకీయపార్టీగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో టీఆర్ఎస్ అవతరించింది. కేసీఆర్ నేతృత్వంలో పార్టీ వ్యవస్థాపక సభ్యునిగా మధుసూదనాచారి చేరాడు. 2001 ఏప్రిల్ 27 నుంచి నేటివరకు కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను విడవకుండా నిలిచారు. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి నడిచిన మధుసూదనాచారి ఆయన చెప్పే ప్రతి విషయాన్ని రికార్డు చేసేవారు.

రాష్ట్ర సాధన ఉద్యమంలో 2001 నుంచి 2014 జూన్ 2 వరకు టీఆర్ఎస్ ఉద్యమ చరిత్రను రేఖామాత్రంగానైనా రికార్డు చేద్దామని నేనొక ప్రయత్నం మొదలుపెట్టాను. ఈ సందర్భంగా 2020లో బీఆర్ఎస్ ఆఫీస్‌కు వెళ్లి ఆఫీస్ ఇంచార్జి ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డిని కలిశాను. లైబ్రరీ ఎక్కడుందని అడిగాను. ఇద్దరు మనుషులనిచ్చి లైబ్రరీకి పంపారు. పార్టీ కార్యాలయంలో పాత పేపర్లన్నీ తిరగేస్తుంటే తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా కేసీఆర్ స్పీచ్‌ను మధుసూదనాచారి స్వహస్తాలతో రాసిన నోట్స్ దొరికింది. అట్లే పాత పేపర్లు తిరగేస్తుంటే ఆయన రాసిన అనేక రాతప్రతులు దొరికాయి. పార్టీ, నిర్మాణ, నిర్వహణల్లో ఆయన విలువ ఏమిటో తెలుసుకునేందుకు ఇది చాలు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత 2014లో భూపాలపల్లి ఎమ్మెల్యేగా మధుసూదనాచారి గెలుపొందారు. 2014 నుంచి 2018 వరకు తొలి స్పీకర్‌గా పనిచేశారు. బీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయితే సిరికొండ మధుసూదనాచారి తొలి స్పీకర్ అయ్యారు. 2023 నుంచి కేసీఆర్ శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉంటే 2024 నుంచి శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా సిరికొండ బాధ్యతలు స్వీకరించబోతున్నారు.

> **సిరికొండ మధుసూదనాచారి స్పీకర్‌గా ఉన్నప్పుడు భూపాలపల్లి నియోజక వర్గానికి చెందిన చెంచులను, రాజన్నల వారు, పిట్టలవారు, కోతులవారులకు హైదరాబాద్ నగరాన్ని చూపించి శాసన సభలోకి తీసుకువెళ్లారు. ఏ వర్గాలకు చట్టసభలలో ప్రాతినిధ్యం లేదో అలాంటి కులాలను ఆహ్వానించి శాసన సభను చూపించిన మనసున్న మనిషి మధుసూదనుడు.**

25 ఏండ్ల వయస్సులో రాజకీయాల్లోకి రావాలనుకున్న సిరికొండ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తెలంగాణ తొలి స్పీకర్‌గా చరిత్రలో నిలిచారు. ప్రజాక్షేత్రంలో నాయకులు ఎదుర్కొనే అనేక సమస్యలను సిరికొండ చవిచూశారు. ఎత్తుపల్లాలను అధిగమించారు. సిరికొండ ఆత్మ కేసీఆర్, హృదయం బహుజనతత్త్వం. తెలంగాణ అస్తిత్వం పరిపూర్ణం చేయడానికి బీసీ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని ప్రతిష్ఠించాలి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల సాధనకు బీసీలకు అండగా బీఆర్ఎస్ వేస్తున్న అడుగులకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు ముగ్గులు పోయమని సిరికొండను కేసీఆర్ ఆదేశించారు. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని ఊపిరిగా చేసుకొని సబ్బండ వర్ణాల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న సిరికొండకు అభినందనలు.

(రేపు సిరికొండ మధుసూదనాచారి తన 69వ పుట్టినరోజు, ఆయన శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా..)

(వ్యాసకర్త: రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు)

ఎటమటం

ఫ్ట్..! డిఫెండ్ చేసుకున్నట్టే ఉన్నది



రాజకీయం అంటేనే అటాక్, డిఫెన్స్ గేమింగ్. రుణమాఫీ హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అప్పుల పేర లెక్కలేని సాకులు జెప్పి, కొంతకాలం నానబెట్టే ఎత్తులు వేసింది. ఆ ఎత్తులను చిత్తు చేయాలనుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రుణమాఫీ అసాధ్యమన్నడు. అది విన్న రేవంత్ 'రాట్.. నేన్ జేస్తా.. అదియునూ ఆగస్టు15 నాటికే' అని డెడ్‌లైన్ పెట్టి మరీ తొడ గొట్టిండు. 'చేస్తవా.. చెయ్. నువు ఆ డేట్ నాటికి రుణమాఫీ చేస్తే, నేను నా ఎమ్మెల్యే గిరిని వదిలేస్తా' అని ప్రతి సవాల్ జేసిండు హరీశ్‌రావు. అనుకున్న డేట్ రానే వచ్చింది. ముఖ్యమంత్రి అటు తన్లాడి.. ఇటు తన్లాడి జరన్ని రుణమాఫీలు మమ అనిపించి 'హరీశ్‌రావు ఇగ రాజీనామా జెయ్'మని గొంతు పెంచిండు. హరీశ్‌రావు లెక్క పక్కేనాయే. డెస్క్ నుంచి ఓ కవర్ తీసి రేవంత్‌కు పంపి పొలిటికల్ ఎటాక్ జేసిండు. ఆ కవర్ చూసిన సీఎం సారుకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయిందట. అందులో రుణమాఫీ కానీ 22 లక్షల మంది రైతుల పేర్లున్నయి. అప్పటినుంచి 'ఎన్ని ప్రెస్‌మీట్లు పెట్టి రుణమాఫీ చేసినమని చెప్పుకుంటున్నా... అది డిఫెండ్ చేసుకున్నట్టే అనిపిస్తుంద'ని ఆ మధ్య క్యాబినెట్ మీటింగుల చెప్పుకొని సీఎం సారు తెగ బాధపడ్డడట.

ప్రజా పాలన కాదు ఉయ్యాలో..

'**దేవ** దేవతలారా ఉయ్యాలో.. ఆది శక్తులారా ఉయ్యాలో..' అని వలపోస్తూ బతుకమ్మకు గోడెళ్లబోసుకున్నరు ఇండ్లు కూలిన జనం. మట్టి మనుషులు కదా, బాధొస్తే పాటందుకుంటరు. పాటతోనే బాధలు పంచుకుంటరు. కడుపు మండినా పాటే.. కొంప కూలినా పాటే. పూట పూటకో పాట పాడి బాధెళ్లదీస్తరు. ఆ పాటల్లో కన్నీళ్లుంటయి, కష్టాలుంటయి, నెత్తురు గాయాలుంటయి. పాటే వాళ్ల బతుకు పొదరింటి ఎనగర్ర. పండుగ వేళ రేవంత్ పంపిన బుల్డోజర్లు పొదరింటిని చిదిమేస్తుంటే... 'కాంగిరేసు రేవంత్ ఉయ్యాలో... కాలయముడై పాయే ఉయ్యాలో... ప్రజాపాలన కాదు ఉయ్యాలో.. రాక్షస పాలన ఉయ్యాలో.. దేవ దేవతలారా ఉయ్యాలో.. ఆదిశక్తులారా ఉయ్యాలో.. మా పేదలను రక్షించ ఉయ్యాలో.. దేవుడే రావాలే ఉయ్యాలో..' అని మహిళలు బతుకమ్మ ఆడిన్రు. ఈయేడు దేవీ నవరాత్రుల సందర్భంగా ఏడజూసినా ఈ పాటలే మార్మోగుతున్నయి.

రొట్టె లేదు.. పెరుగు లేదు

'**రొట్టెన్న** లేదాయే.. గడ్డ పెరుగుంటే అద్దుకొని కడుపు నిండా తిందును' అని ఎనుకటికొక పెద్ద మనిషి ఆశ పడ్డట్టే ఉన్నది రైతున్నల పరిస్థితి. రుణమాఫీ చేసి, అదను మీద రైతు భరోసా ఇస్తే.. సాగు ఇక పండగే పండుగ అని ఆశపడ్డరు అన్నదాతలు. కానీ, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దసరా కానుక కింద మరో బాంబు పేల్చిండు. 'రుణమాఫీ కాదు, రైతు భరోసా కూడా లేదు' అని చావుకబురు సల్లగా చెప్పిండు. రుణమాఫీ పూర్తయ్యేవరకు రైతు భరోసా లేదని తేల్చిచెప్పిండు. ఆ ఒక్క మాటతో రైతన్న ఏం జెయ్యాలో సమజ్‌గాక బిరిపోయిండు.

బొక్కబోర్లా పడి..

ముందు మురిసినమ్మ పండగెరుగదన్నట్టే ఉందట హర్యానా కాంగ్రెసోళ్ల సంగతి. కాంగ్రెస్‌దే ఘన విజయమని సర్వే సంస్థలన్ని చెప్పినయి కదా? తీరా గెలిచినంక జిలేబీలు, బాణసంచాలు, పూలదండలు ఆర్డర్ చేస్తే లేటవుతుందని ముందుగాళ్లనే కొనుక్కొని పెట్టుకున్నరట, బాజా భజంత్రీలను కూడా పిలిపించి రెడీ ఉంచారట. ఫలితాలు రివర్స్ కావడంతో బొక్కబోరాల పడి బిక్కపోయారు. ఏం చెప్పుకోవాలో అర్థం కాక ఈవీఎంల మీద పడ్డారు. ఎలక్షన్ కమిషన్ గోల్‌మాల్ వల్లే ఓడిపోయామని కొత్తపాట ఎత్తుకున్నారు. తాము అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాలల్ల పాలన సక్కగుంటే హర్యానా ప్రజలు ఎందుకు ఎగరగొడతారు? గ్యారెంటీలు త్యాపకొకటి పెంచుకుంటూ పోతే పవర్ గ్యారెంటీ అనుకున్నారేమో పాపం!.

- చిన రాజయ్య